నమస్తే తెలంగాణ

# మెదక్

I | హైదరాబాద్, శనివారం 18 మే 2024 | MEDAK



మనోహరాబాద్ మండలం దండుపల్లి చౌరస్తా వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి, పాల్గొన్న రైతులు

# కాంగ్రెస్ పాలనలో రైతుల అరిగోస

- రైతులకు బోనస్ వెంటనే ఇవ్వాలి
- తడిసిన ధాన్యాన్ని కొనాలి
- ఏ ఒక్క హామీ సరిగ్గా అమలు చేయని కాంగ్రెస్ సర్కారు
- రాష్ట్ర అటవీశాఖ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

మనోహరాబాద్, మే 17: పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో రైతులు సంతోషంగా వ్యవసాయం చేసుకుంటే, ఐదునెలల కాంగ్రెస్ సర్కారులో అరిగోస పడుతున్నారని రాష్ట్ర అటవీశాఖ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. వడ్లకు బోనస్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. శుక్రవారం మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం దండుపల్లిలో కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం ఆరబోసిన రైతులతో ఆయన ముచ్చటించాడు. అనంతరం పార్టీ పిలుపు మేరకు బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి నిరసన, ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అకాల వర్షాలు కురుస్తున్నా, ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవడంలో విఫలమైందన్నారు. సన్న వడ్లు, దొడ్డు వడ్లు అనే తేడాలేకుండా వెంటనే అన్ని వడ్లకు బోనస్ ఇవ్వాలని సర్కారును డిమాండ్ చేశారు. బోనస్ దేవుడెరుగు, ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో వర్షానికి మొలకలెత్తే పరిస్థితి నెలకొందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు రైతులకు ఏ కష్టం రాకుండా కేసీఆర్ చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. ఆరు గ్యారెంటీలు, 420 దొంగ హామీలతో గద్దెనెక్కిన సీఎం రేవంత్‌రెడ్డి ఒక్క హామీ సరిగ్గా అమలు చేయలేదని వంటేరు ప్రతాప్‌రెడ్డి విమర్శించారు. ప్రశ్నించిన వారిపై తప్పుడు కేసులు పెడుతూ బెదిరింపులకు పాల్పడుతున్నారని, కేసులు మాకేం కొత్త కాదని ప్రజలకు, రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని, మా జోలికి వస్తే ఖబడ్దార్ అని ప్రతాప్‌రెడ్డి హెచ్చరించారు. దొంగదందాలు, మట్టిమాఫియా, అక్రమ భూ దందాలు చేసే వారే బీఆర్ఎస్ నుంచి వెళ్లిపోయారని, నికార్సైన పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు బీఆర్ఎస్‌కు అండగా ఉన్నారన్నారు.

## పోలీసులారా.. మీరూ రైతు బిడ్డలే..

పోలీసులారా.. మీరూ రైతు బిడ్డలేనని, తాము రైతుల పక్షాన పోరాటం చేస్తున్నామని, రాజకీయం చేయడం లేదని రాష్ట్ర అటవీశాఖ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. స్థానిక పోలీసులు నిరసన చేస్తున్న వారి ఫొటోలు, వీడియోలు తీయడంపై ఆయన ప్రశ్నించారు. మేము, మీరు ఒక్కటేనని, మేము రైతుల పక్షాన పోరాడుతుంటే, మీ ఉన్నతాధికారులు కేసులు చేయమని మిమ్మల్ని ఒత్తిడి చేస్తున్నారన్నారు. "మీరు మేము ఒక్కటే పోలీసు అన్నల్లారా.." అంటూ ఆయన పాట పాడారు. ఆందోళనలో ఎంపీపీ పురం నవనీత రవి ముదిరాజ్, ఎంపీటీసీ లతావెంకటేశ్‌గౌడ్, తూప్రాన్ మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు సతీశ్‌చారి, నాయకులు పంజా భిక్షపతి, రేణుకుమార్, వెంకటేశ్ యాదవ్, రమేశ్, కృష్ణాగౌడ్, ఉదయ్, మన్నె శ్రీనివాస్, చంద్రారెడ్డి పాల్గొన్నారు.



దుబ్బాక టౌన్: దుబ్బాక వ్యవసాయ మార్కెట్ యార్డులో వర్షానికి తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టుతున్న రైతులు

# రైతు కష్టం వర్షార్పణం

## ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర జాప్యం.. అకాల వర్షాలకు తడుస్తున్న ధాన్యం

- ఉదయం ఆరబెట్టడం.. సాయంత్రం తడిసి ముద్దవడం
- రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంపై రైతుల ఆగ్రహం
- తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనాలని డిమాండ్
- అన్ని వడ్లకు రూ. 500 బోనస్ చెల్లించాలి: రైతులు



దుబ్బాక టౌన్: దుబ్బాక ఏఎంసీ యార్డులో | సిద్దిపేట: సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో వర్షానికి తడిసిన ధాన్యం

దుబ్బాక టౌన్, మే 17: రైతులకు అది చేస్తాం... ఇది చేస్తాం అని గొప్పలు చెప్పిన కాంగ్రెస్ సర్కార్, అన్నదాతలు పండించిన ధాన్యాన్ని కొనుగోలు సాగదీతతో వారి కష్టం వర్షార్పణం అయ్యింది. ఆరుగాలం పండించిన పంట తమ కండ్ల ఎదుటే వర్షపు నీటిలో కొట్టుకుపోతుంటే రైతులు గుండెపగిలేలా రోదిస్తున్నారు. కొనుగోళ్ల జ్యాప్యం, మరోవైపు అకాల వర్షాలు రైతులకు తీరని నష్టాన్ని కలిగిస్తున్నాయి. పది రోజులుగా అమ్ముకునేందుకు తెచ్చిన ధాన్యం అకాల వర్షాలకు తడిసి ముద్దవ్వడం, వెంటనే ఆరబెట్టడం, మళ్లీ వర్షం పడటం, తిరిగి ఆరబెట్టడం ఇదేతంతు దుబ్బాక వ్యవసాయ మార్కెట్ యార్డులో జరుగుతున్న తీరు. వరి పొట్టకొచ్చింది మొదలు కోసి, అమ్మే వరకు రైతులు దినదిన గండంగా కాలం వెల్లదీస్తున్నారు. అమ్ముకునేందుకు తెచ్చిన ధాన్యం అకాల వర్షాలకు మొలకెత్తడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇంటిల్లిపాది నిద్రాహారాలు మాని కొనుగోలు కేంద్రాల్లోనే ఉంటూ ధాన్యాన్ని ఆరబెట్టుకోవడం పరిపాటిగా మారింది. కొనుగోళ్లు వేగంగా జరిగితే ఎలాంటి ఇబ్బంది ఉండదని రైతులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజుల తరబడి తూకం వేయకపోవడంతో కొనుగోలు కేంద్రాల్లోనే ఉండాల్సిన దుస్థితి నెలకొందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రోజు తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టడం, సాయంత్రానికి అకాల వర్షానికి తిరిగి ధాన్యం తడవడం జరుగతున్నదని రైతులు తమ గోడును వెల్లబోసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు. వర్షాకాలం సాగుకు సిద్ధం కావాల్సిన సమయంలో రైతులు తమ ధాన్యాన్ని అమ్ముకోలేక కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నామన్నారు. ఎండకు ఎండి, వానకు తడిసి రైతులు నానా ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా వెంటనే స్పందించి కొనుగోళ్లను వేగవంతం చేయాలని కోరారు.

## కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం

**-తడిసిన వడ్లు కొనాలని రైతుల విజ్ఞప్తి**

సిద్దిపేట, మే 17: అకాల వర్షంతో రైతన్న ఆగమవుతున్నాడు. శుక్రవారం సిద్దిపేట పట్టణంతో పాటు పలు గ్రామాల్లో కురిసిన అకాల వర్షానికి కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసి ముద్దయ్యింది. రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆరుగాలం పండించిన పంటను కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి అమ్ముకుందామంటే వర్షాలు తీవ్ర కష్టానికి గురిచేస్తున్నాయి. కాంగ్రెస్ సర్కారు వచ్చాక ఈసారి ధాన్యం కొనుగోళ్లు వేగంగా జరగడం లేదు. తేమశాతం, తరుగు, ఇతరత్రా కొర్రీలు పెట్టి నిర్వాహకులు కాంటాలు ఆలస్యం చేస్తున్నారు. దీంతో రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. అకాల వర్షానికి ధాన్యం కుప్పలు, ఆరబెట్టిన ధాన్యం తడిసి పోతుండడంతో రైతులు నష్టపోతున్నారు. ప్రభుత్వం ఇకనైనా పట్టించుకొని వేగంగా ధాన్యం సేకరణ జరిగేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

### వెంటనే ధాన్యాన్ని సేకరించాలి



పది రోజుల కిందటే పొలం కోసిన వెంటనే మార్కెట్ యార్డులో అమ్మేందుకు వడ్లుపోసిన. ఇప్పటి వరకు కొనలేదు. అకాల వర్షాలకు వడ్లు తడుస్తున్నాయి. వాన నీటిలో కొట్టుకుపోతున్నాయి. ఇంటిల్లిపాది ఇక్కడే ఉండి అరబెట్టుకుంటున్నాం. ఎన్ని కవర్లు ఉన్నా సరిపోవడం లేదు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలి. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం రూ.500 బోనస్‌ను వెంటనే ఇవ్వాలి.

– విఠల్, రైతు, దుబ్బాక

### వడ్లన్నీ వానలో కొట్టుకుపోయినవి..



మా కండ్ల ముందటే వర్షానికి వడ్లు కొట్టుకుపోతున్నాయి. చాలా బాధగా ఉంది. ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి. పది రోజులుగా వడ్లను ఆరబెడుతున్నాం. ఒక్కసారిగా వర్షం రావడంతో తడిసి ముద్దవుతున్నాయి. వర్షానికి వడ్లు మొలకలు వస్తున్నాయి. ప్రభుత్వం వెంటనే కొనాలి. వడ్లు అమ్మేందుకు రైతులు పడుతున్న ఇబ్బందులు తొలిగించాలి.

–దేవుని నర్సవ్వ, మహిళా రైతు, దుబ్బాక

### తడిసిన వడ్లు కొనాలి



ఆరు రోజుల కింద సిద్దిపేట వ్యవసాయ మార్కెట్‌కు వడ్లను తెచ్చాం. తేమశాతం రాకపోవడంతో వడ్లను ఆరబెట్టినం. నిన్న కొనుగోలుకు టోకెన్ ఇచ్చి బస్తాలు ఇచ్చారు. నిన్న సాయంత్రం వర్షం పడడంతో కొనుగోలు జరుపలేదు. నిన్నటి వర్షానికి వడ్లు నానిపోయాయి. ఈరోజు ఆరబెట్టినం. ప్రభుత్వం తడిసిన వడ్లను కొనాలి. – దరిపల్లి ఎల్లయ్య, రైతు, సిద్దిపేట

# రైతన్నకు తీరని నష్టం

- కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంతోనే ధాన్యం నీళ్లపాలు
- నెల, ఇరవై రోజుల కిందే కేంద్రాలకు తెచ్చినా సేకరణలో తాత్సారం
- అకాల వానతో కేంద్రాల్లో తడిసిన ధాన్యం
- కన్నీరు పెడుతున్న అన్నదాతలు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు



కొల్చారం: కోనాపూర్‌లో వర్షానికి తడిసిన ధాన్యాన్ని చూపుతున్న రైతు



చిలిపిచెడ్: చండూర్‌లో వర్షానికి తడిసిన ధాన్యం చూపుతున్న రైతులు



కౌడిపల్లి: మంతాయిపల్లి తండాలో మెదక్-సంగారెడ్డి రోడ్డుపై వర్షానికి తడిసిన తూకం వేసిన ధాన్యం బస్తాలు

చిలిపిచెడ్,(కొల్చారం), మే 17: రైతన్న గుండె చెరువైంది.కాంగ్రెస్ ప్రభుత్వం తీరుతో తీరని దు:ఖమే మిగిలింది. యాసంగిలో కరెంట్ కోతలు, బోరుబావులు నీరు అడుగంటి పంటలకు సరిగ్గా నీరందక వందలాది ఎకరాల్లో వరిపంట ఎండిపోయింది. కొద్దో గొప్పో పండిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తెస్తే సేకరణలో కేంద్రాల నిర్వాహకులు చూపిన నిర్లక్ష్యంతో రైతుల కష్టం నీళ్లపాలైంది. నెల, ఇరవై రోజుల కింద నుంచి కొనుగోలు కేంద్రాలకు వడ్లు తెచ్చినా కాంటా కాక అకాల వర్షాలకు ధాన్యం తడిసి రైతులు నష్టపోవాల్సి వచ్చింది. రెండ్రోజుల కింద కురిసిన అకాల వర్షంతో కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయ్యింది. మెదక్ జిల్లా కొల్చారం మండలంలోని తుక్కాపూర్, చిన్న ఘనపూర్, సంగాయిపేట, రంగంపేట గ్రామాల్లో వర్షానికి వడ్ల కుప్పలు కుప్పలే కొట్టుకుపోగా, రెక్కల కష్టం కండ్ల ముందే నీళ్లపాలు కావడంతో రైతులు కన్నీరు పెడుతున్నారు. వర్షం బారినుంచి ధాన్యాన్ని కాపాడుకునేందుకు మొన్న అష్టకష్టాలు పడ్డారు. నిన్న ఎక్కడ చూసినా తడిసిన ధాన్యాన్ని ఆరబోస్తూ.. నేర్పుతూ.. బస్తాల్లో నింపుతూ రైతులు కనిపించారు. ఎవరిని కదిలించినా కన్నీటి పర్యంతమవుతున్నారు. ఆరుకాలం శ్రమ నీటిపాలైందని గొడగొడ ఏడుస్తున్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే ఇవాళ తాము నష్టపోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటవెంటనే ధాన్యం కొంటే ఈ దుస్థితి వచ్చేది కాదన్నారు.



దండుపల్లిలో కొనుగోలు కేంద్రాల్లో సన్నవడ్లను కొనుగోలు చేయకపోవడంతో తక్కువ ధరకు దళారులకు అమ్ముకుంటున్న రైతులు

# సన్నాలూ కొంటలేరు!

- కొనుగోలు కేంద్రాల్లో సన్నవడ్లను కొనుగోలు చేయకపోవడంతో రైతుల ఇబ్బందులు
- దళారులకు విక్రయిస్తున్న అన్నదాతలు
- రూ. 1600 నుంచి రూ. 2000 క్వింటా విక్రయం

మనోహరాబాద్, మే 17: కాంగ్రెస్ పాలనలో రైతులకు తిప్పలు తప్పడం లేదు. దొడ్డు వడ్లు, సన్న వడ్లు పండించిన రైతన్నలు ధాన్యాన్ని విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. బోనస్ దేవుడెరుగు కనీసం పండించిన ధాన్యాన్ని కొనేందుకు ప్రభుత్వం ముందుకు రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధిక డిమాండ్ ఉన్న సన్న వడ్లకు సైతం కష్ట కాలం దాపురించింది. కొనుగోలు కేంద్రాల్లో సన్న వడ్లను అసలే కొనుగోలు చేయకపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. అకాల వర్షాలకు ఎక్కడ నష్టపోతామన్న భయంతో తక్కువ ధరకే దళారులకు విక్రయిస్తున్నారు. క్వింటాల్ సన్న వడ్లు రూ. 1600 నుంచి రూ. 2000 వరకు విక్రయిస్తున్నట్లు పలువురు రైతులు తెలిపారు.

### సన్న వడ్లను అసలే కొంటలేరు



దొడ్డు వడ్లను తప్ప సన్న వడ్లను అసలే కొనడం లేదు. వారం రోజులు పడుతుందంటున్నారు. అప్పటి వరకు రోడ్లపై ఆరబోసిన వడ్లన్నీ అకాల వర్షానికి నేలపాలవుతున్నాయి. చేసేదేమి లేక దళారులకు క్వింటాల్‌కు రూ. 1600 నుంచి రూ. 2000 వరకు విక్రయించుకుంటున్నాం.

–మహేశ్, రైతు, కొనాయిపల్లి పీటీ

### ప్రతి గింజా కొనుగోలు చేస్తాం

రైతులు పండించిన ప్రతి గింజనూ తప్పకుండా కొనుగోలు చేస్తాం. తడిచిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తాం. రైస్‌మిల్లుల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోయాయి. రైస్‌మిల్లులకు ఇచ్చిన నిల్వల కంటే రెండు, మూడేండ్లుగా రెట్టింపు ఇచ్చాం. దీంతో సమస్య ఉత్పన్నమైంది. రైతులు అధైర్య పడవద్దు. రెండు రోజులు ఆలస్యమైనా, అకాల వర్షానికి తడిచిన ధాన్యాన్ని సైతం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కొనుగోలు చేస్తాం.

–చంద్రశేఖర్‌రెడ్డి, తహసీల్దార్, మనోహరాబాద్

# యువత భుజస్కంధాలపై దేశ భవిష్యత్

- కౌటిల్యలో పట్టాల ప్రదానోత్సవంలో జస్టిస్ ఏకే మిశ్రా




కౌటిల్య పబ్లిక్ పాలసీ పట్టాల ప్రదానోత్సవంలో పాల్గొన్న జస్టిస్ అరుణ్ కుమార్ మిశ్రా

పటాన్‌చెరు, మే 17: దేశ భవిష్యత్ యువత భుజస్కంధాలపై ఉందని జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ అరుణ్ కుమార్ మిశ్రా అన్నారు. శుక్రవారం గీతం హైదరాబాద్ ప్రాంగణంలోని కిన్నెర సెమినార్ హాల్‌లో కౌటిల్య స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ రెండో పట్టాల ప్రదానోత్సవ వేడుకను ఘనంగా నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన చేసి ఈ వేడుకను ఆయన ప్రారంభించారు. పబ్లిక్ పాలసీలో మాస్టర్స్ డిగ్రీలు అందుకుంటున్న విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పబ్లిక్ పాలసీ పట్టాలు పొందిన విద్యార్థులు కీలక దేశాభివృద్ధిలో పాత్ర పోషిస్తారన్నారు. భారత రాజ్యాంగం గొప్పతనం, జాతీయ మానవ హక్కుల కమిషన్ విధులను ఈ సందర్భంగా ఆయన వివరించారు. గీతం అధ్యక్షుడు ఎం.శ్రీభరత్ ఈ సందర్భంగా పట్టభద్రులను అభినందించారు. గీతం మారుతున్న కాలానికి తగ్గట్టుగా సామాజిక స్పృహతో డిమాండ్ ఉన్న కోర్సులు ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. విద్యార్థులకు జ్ఞానంతో పాటు ఉపాధి కల్పించేలా ఆత్మవిశ్వాసం గీతం క్యాంపస్‌లో కల్పిస్తున్నట్లు తెలిపారు. కౌటిల్యలో పట్టాల ప్రదానోత్సవంలో 25మందికి స్నాతకోత్తర (పీజీ) డిగ్రీలను, అత్యుత్తమమైన ప్రతిభను కనబర్చిన విద్యార్థులకు బంగారు పతకాలను అందజేశారు. యనమండ్ర మల్లికార్జునరావు బంగారు పతకాన్ని, ప్రణీత పుల్లను రాజు, ప్రియా భట్కర్‌లు సంయుక్తంగా బంగారు పతకాన్ని అందుకున్నారు. అంతర మైత్ర డీన్ అవార్డును అందుకున్నారు. పబ్లిక్ పాలసీ మాస్టర్స్ ప్రోగ్రామ్ మొందటి ర్యాంకర్‌గా ప్రణీత పుల్లంరాజు గీతం ప్రెసిడెంట్ బంగారు పతకాన్ని అందుకున్నారు. కార్యక్రమంలో గీతం అధ్యక్షుడు ఎం.శ్రీభరత్, కౌటిల్య డీన్ ప్రొఫెసర్ సయ్యద్ అక్బరుద్దీన్, గీతం అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీఎస్ రావు, కౌటిల్య సహ వ్యవస్థాపకుడు ప్రతీక్ కన్వల్ పాల్గొన్నారు.

# స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద పటిష్ట భద్రత

- సీసీ కెమెరాలు ఏర్పాటు
- సాయుధ బలగాలతో పహారా
- రాష్ట్ర అదనపు ఎన్నికల కమిషనర్ లోకేశ్ కుమార్
- గీతం వర్సిటీలోని స్ట్రాంగ్‌రూమ్‌ల పరిశీలన



పటాన్‌చెరులోని గీతం ప్రాంగణంలో పోలీసు బందోబస్తును పరిశీలిస్తున్న రాష్ట్ర అదనపు ఎన్నికల కమిషనర్ లోకేశ్‌కుమార్, కలెక్టర్ క్రాంతి వల్లూరు, ఎస్పీ రూపేశ్ కుమార్

పటాన్‌చెరు, మే 17: గీతం వర్సిటీలోని స్ట్రాంగ్‌రూమ్‌లను శుక్రవారం రాష్ట్ర అదనపు ఎన్నికల కమిషనర్ లోకేశ్‌కుమార్ పరిశీలించారు. పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామ పరిధిలోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాద్ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన జహీరాబాద్ ఎంపీ ఎన్నికల స్ట్రాంగ్‌రూమ్‌లను ఆయన కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎస్పీ రూపేశ్ కుమార్‌లతో కలిసి సందర్శించారు. స్ట్రాంగ్ రూంల వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశామని ఎస్పీ ఈ సందర్భంగా తెలిపారు. మూడంచెల సెక్యూరిటీ లాక్‌బుక్ రిజిస్టర్స్‌లను, ఈవీఎంల భద్రత ఏర్పాట్లను రాష్ట్ర ఎన్నికల అదనపు కమిషనర్ లోకేశ్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా లోకేశ్ కుమార్ మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా లోటుపాట్లకు తావులేకుండా కౌంటింగ్ కేంద్రం వద్ద పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేశారన్నారు. జిల్లా పోలీస్ విభాగం చేసిన ఏర్పాట్లు పారదర్శకంగా ఉన్నాయని తెలిపారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం భద్రత కల్పించినట్టు చెప్పారు. ఈవీఎంలను భద్రపర్చిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద సాయుధ బలగాలతో పహారా ఏర్పాటు చేశారన్నారు. ఎలాంటి అనుమానాలకు తావులేకుండా స్ట్రాంగ్ రూమ్‌లకు భద్రత కల్పించామన్నారు. స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, వాటితో పాటు పరిసరాలను అనుక్షణం పరిశీలించేందుకు వీలుగా సీసీ కెమెరాలను అమర్చినట్టు తెలిపారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద, కౌంటింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ నిషేధాజ్ఞలు అమలులో ఉన్నట్లు తెలిపారు. ఓట్ల లెక్కింపు కేంద్రంలోకి ఇతరులెవ్వరూ లోనికి వెళ్లకుండా కుట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని జిల్లా అధికారులను ఆయన ఆదేశించారు. గీతం యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన ప్రతి కౌంటింగ్ హాల్, స్ట్రాంగ్‌రూమ్ సీల్‌ను క్షుణ్ణంగా పరిశీలిస్తూ అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. జూన్ 4న చేపట్టనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా అన్ని సదుపాయాలు కల్పించాలన్నారు. కౌంటింగ్ కేంద్రంలో ఓట్ల లెక్కింపు విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది రాకపోకల కోసం వేర్వేరు మార్గాల్లో బారికేడ్లను ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ సరఫరా, కౌంటింగ్ టేబుల్స్ ఇతర ఏర్పాట్లు పక్కాగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ.. ఈవీఎంలు ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లకు అదనపు ఇనుప గ్రిల్స్ ఏర్పాటు చేసినట్టు వివరించారు. కౌంటింగ్ కేంద్రం వద్ద అదనంగా జనరేటర్ ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ తెలిపారు. వారి వెంట ట్రైనీ ఐఏఎస్ మనోజ్, కామారెడ్డి ట్రైనీ ఐపీఎస్ కాజల్‌సింగ్, ప్రత్యేకాధికారి రవీందర్ రెడ్డి, ఎన్నికల అధికారులు ఉన్నారు.